# చీమలూ బెల్లమూ

## 1

రత్నం శ్రేష్ఠి వ్యాపారం చిన్నదే. చిన్న కిరణా షాపు, బెల్లపు దిమ్మలూ, బెల్లపచ్చులూ వుండలుండలుగా తయారుచేసిన బెల్లమూ టోకుని కొని చిల్లరగా అమ్మటంలో నేర్పరి అయినాడు శ్రేష్ఠి. నిత్యావసర వస్తువులూ సరసమైన ధరకే అమ్ముతాడు.

తల్లీ, భార్యా రొద, సస బెట్టారు.

నీలాలిస్తానన్నాను స్వామీ. మొక్కు తీర్చుకు రావాలి. యెంత జబ్బు పడ్డారూ! బెంబేలెత్తిపోయాను. మొక్కు చెల్లించక పోతే వడ్డీకాసులవాడు రెట్టింపు రాబడతాడు అని భార్యా రొద.

తల్లేమో! నాయనా రత్నం! ఉప్పెనో, వూదరో అని ఒక్కగా నొక్క సంతానాన్ని కళ్ళల్లో ఒత్తులేసుకుని పెంచుకొచ్చాను. ఎన్ని బాలగండాలు దాటావురా నాయనా, గండాల గౌరివిరా రత్నం. కొండ యెక్కుతామని మొక్కుకున్నాను, నువ్వు బయలుదేరాలి. వ్యాపారానికేంలే. యెప్పుడూ వుండేదే. అదెక్కడికి పోతుందీ? కాపలా మనిషిని పెడదాం, కొట్టుమీద నీ బావమరిది కూచుంటాడు, కుర్రాడు చేతికింద వుంటాడు. ఎంత జబ్బు! యెంత జబ్బు! స్మారకం తప్పింది, బేజారైనాను. మంచి రోజు చూశాము. టిక్కెట్టు కొనిపించాము. నా మురిడీ గొలుసులు అరిగి విరిగిపోతే అమ్మించాను. దారి ఖర్చులకి సరిపోతుంది అని ఘోష.

ఈ బెల్లపు దిమ్మ అమ్మేసి పోదామని చూస్తున్నానమ్మా! ఇదొక్కటే, తక్కినదంతా అమ్ముడుపోయింది అన్నాడు రత్నం.

ద్దాన్ని భద్రం చేద్దాంలే అన్నది తల్లి.

తేనెరంగులో వుండి నోరూరిస్తున్న బెల్లపుదిమ్మెను తాటాకుల బుట్టలో పెట్టి, మూసి, తాడు బిగించి, చిన్న బల్లమీదుంచి, ఆ బల్లను పెద్ద పళ్ళెంలో నీళ్ళు పోసి కాళ్ళు మునిగేట్టుంచి, చీమల మందు పళ్లెం చుట్టూ చల్లి నిశ్చింతగా ప్రయాణమైనాడు రత్నంశెట్టి. ఇద్దరు చిన్నబిడ్డలూ, తానూ, భార్యా, తల్లీ పెట్టె, బెడ్డింగూ, ప్లాస్టిక్ బుట్టలో తిండీ, మంచి నీళ్ల బాటిల్సూ.

## 2

చీమలు బారులు తీరినై. మొగలి చీమలు, యెర్ర చీమలూ, వల్ల చీమలూ, కండ చీమలూ, చాలా రకాలు వాటికి కొన్ని యెదురిచ్చి ముక్కు ముక్కు అనిస్తూ మంచీ శబ్బరా అడిగాయి.

యెటునించి వస్తున్నారు బావగారూ?

యేమని చెప్పను? వానలు పడి, పుట్టలు పూడి నిలువ నీడ లేక, తిండి కరవై, చలికి వణుకుతూ స్థావరం కోసం యెత్తైన చోటు చూసి పుట్టలు నిర్మించాలనీ, తిండిగింజల కోసమూ, వాటిని నిలవ చేసే చోటు చూడాలనీ బయలుదేరాము. అంతా నీటిమయం, అల్లాడిపోతున్నారు బిడ్డలు. మీ యెరికనెక్కడైనా పొడిచోటు తిండి గింజలు, ముఖ్యంగా బెల్లమున్నా చోటు వుంటే చెప్పి పుణ్యం కట్టు

కోండి బావగారు. సాటివారము. మనం మనం ఒహటి చీమల లీడర్ విచారంగా చెప్పింది.

తోలు వచ్చి మద్దెలతో మొరబెట్టుకున్నదని సామెతలాగా వున్నది మా పరిస్థితి. మేము వున్న వూరు వదిలేయాల్సివచ్చింది. వానలకు తట్టుకోలేక కొన్నాళ్లు చెట్టుమీదున్నాం. యేమని చెప్ప మంటారు కొన్నాళ్ల? పీ వానకు తడిసి ముద్దై, జర్రున జారటం లేదా బల్లులూ మొదలైనవి ఆహారం కోసం వచ్చి మింగేయటం జరిగింది అని కంట తడిబెట్టింది చీమల లీడర్.

దేముడు లేడా పిపీలికాల గతేమిటి. నారు పోసినవాడేమై నాడో అని వాపోయింది చీమ.

కాసేపు ఆకాశం వంక చూస్తూ ముందు కాళ్ళెత్తి నిలబడి ప్రార్థించాయి పిపీలికాలన్నీ.

మీరన్నట్టు ఏప్రిల్, మే, జూన్ నెలలు మేటింగ్ సీజన్. అసంఖ్యాకంగా పాపులేషన్ వృద్ధి అయింది బావగారూ! వలస వచ్చినవారూ, ఆశ్రయం కోసం వచ్చిన దిక్కులేనివారూ, రాజకీయ ఆశ్రయం పొంది వచ్చినవారూ వెరసి పుట్టలకొద్దీ పిపీలికాలు సంఖ్యను మరింత పెంచాయి అర్బుదంలో కెళ్ళింది సంఖ్య అంటు న్నారు,

దిక్కు తోచనట్టు చూసింది కండచీమ.

ఆశావాదులం కావాలి, నారుపోసిన వాడున్నాడని నీరు పోస్తాడనీ ఆశావాదులు కావాలని, ఈశపుత్ర మతస్థులు మొదట్లో

ప్లస్ రూపంలో వున్న ఒక గుర్తును పంచేవారుట. రెండోది తాళం చెవీ, అంటే కీ టు హెవెన్ ఐకమత్యం గలిగి శ్రమజీవులు కావాలని.

యేమైనా ఆశ వున్నదంటారా? అన్నాడాశతో కళ్ళు మెరవగా కండచీమ.

వున్నది వాసన బట్టాము. అందుకే బయలుదేరాము బారులు బారులుగా కొత్త బెల్లపు దిమ్మ, తీయని వాసన కాని అని ఆగాడు వృద్ధ చీమ.

కానీ లేదు. కూనీ లేదు. చెప్పండి బావగారూ! యెక్కడున్న దీ దిమ్మె! సాహసే లక్ష్మి అన్నారు. సాహసిద్దాం. మన జాతిని కాపాడు కోవాలి. మనిద్దరికోసమా? బాగా ఎక్సైటై ప్రోత్సహించాడెర్ర చీమ.

బెల్లమేమో బాలా వున్నది. మణుగు దిమ్మ, మంచి బందో బస్తు చేశాడు ఆసామీ, సిమెంటు కలిపి అమ్మితే బాగా తూకం వస్తుందని కలుపుతున్నారని విన్నాను. యెంత కలిసిందో తెలియదు అందరికీ కావాలిగా, వుపాయం గూడా చూడాలి దిమ్మ దరిచేరాలి అన్నాడు తల గోక్కుంటూ యెర్ర చీమ.

సర్కారువారు పట్టేస్తారు. సెమ్మెంటూ లేదు, గిమ్మెంటూ లేదు. అంతేగాక వుపాయం తెలియనివాడిని వూళ్ళోనించి తరిమేయా లన్నారు పెద్దలు. నే చూస్తాగా, దరిచేరే పద్ధతి. దిమ్మవేపు దారి తీ నుంచి అన్నాడు వయసులో వున్న కండచీమ.

బారులు బారులుగా పాము మెలికలుగా, ఒకరినొకరు పలక రింపుకుంటూ, ధైర్యోత్సాహాలతో అన్ని రకాల చీమలూ ఐక మత్యంతో రత్నంశెట్టి యింటివేపు నడిచాయి. వాసన రాగానే పుత్సాహం పుంజుకున్నాయి.

గమ్యం చేరాయి. అన్నీ బిగించి వున్నా, యెక్కడన్నా సందు దొరక్కపోతుందా అని శ్రమించాయి. శ్రమ ఫలించి తూము కని పించింది. అది పొడవుగా వుండటం మరింత ప్రోత్సాహమిచ్చింది. వాసన బట్టి బెల్లమున్న గదిలోకి దారి కనబడితే బిలబిల మని దూరితే, మందు వాసన నిరుత్సాహపరిచింది.

ఆ పొడి మనలనేం చేయలేదు. ఇంటినిండా మట్టి పేరు కున్నది గదూ. నేను లావూ పొడుగూ, నా కాళ్లు యెత్తూ, నేను దారి చేస్తా, మట్టికాళ్ళతో బారుగా రండి మట్టిరోడ్డు తయారౌతుంది. మరీ నలకల్లాగా వున్నవారు బలంగా యెత్తుగా వున్నవారి వీపు మీదెక్కి రండి అని ధైర్యం చెప్పింది లీడరు చీమ.

మెల్లిగా బుట్టమీ.కి చేరగలిగాయి చీమలు. తాటాకుల బుట్టేగా. అల్లికమధ్య కన్నాలుంటాయి వాటిల్లోంచి దూరి లొట్ట లేసుకుంటూ కడుపారా తిన్నంత తిని వుండలాంటిది నోట కరచు కొని వెళ్ళిపోసాగాయి. చుట్టూ చేరినవారికి, మూగివున్నవారికీ, వెయిట్ చేస్తున్నవారికీ, ముందుకు రాలేనివారికీ గూడా అందించాయి బెల్లం ముక్కలను. కొన్ని గడుసు చీమలు నేల యెండిందని గమ నించి, గుండ్రని బెల్లపుగడ్డలు దొర్లిస్తూ పుట్ట తయారు చేసి దానిలో

దొర్లించసాగాయి. చాలా సందడి. చూడ ముచ్చటగా వున్నది. దేవుని కొండ యెక్కి దేవుని దర్శనం చేసుకుని దిగివచ్చే భక్తుల లాగా వున్నాయి చీమలు.

దిమ్మె నామరూపాలు కోల్పోయింది. ముసలమ్మ నోరులా తాటాకుల బుట్ట మిగిలింది.

చీమలన్నీ పుట్టలు నిర్మించి వాటిలో కాపరాలు వెలిగించ సాగాయి. పరాయి వారెవరైనా లోపలికి రావాలని ప్రయత్నిస్తే, యెర్ర చీమలూ, కండచీమలూ వారి రక్తం కళ్ళ చూశాయి. కండలు నంటిపెట్టుకుని పీక్కు తిన్నాయి. అందుకే కండచీమ అని పేరు వచ్చింది. శత్రువులు మంటలకు తాళలేక కాలికి బుద్ధి చెప్పారు. ఆ ఛాయలకు రాలేదు.

3

రత్నంశెట్టి ఆలస్యంగా యిల్లు చేరాడు. ఎగువ తిరుపతి, దిగువ తిరుపతి, పాపనాశనం, ఆకాశగంగా కోనేట్లో స్నానం, ఏడు కొండలవాడి కడ్డంగా కట్టిన తెరదీసె దాకా నిలబడటం, అదీ క్యూలో నిలబడాలి, కుటుంబ సభ్యులందరికీ కావాల్సినవి కొను క్కోటం నీలాలిచ్చే ముచ్చటా జరుపుకుని, పద్మావతీ కళాశాలా, తిరుపతి యూనివర్సిటీ సందర్శించారు. కూతురికి బొమ్మలు, తల్లికి పూజా పాత్రలు, తిరుపతి ప్రసాదం మరికాస్త కొన్నారు. పాము మెలికలాగా వున్న బస్‌రూట్ చూశారు. సత్రంలో గది అద్దెకు తీసుకుని విశ్రాంతిగా గడిపారు. ఇంటి దగ్గర మునిగిపోయే

దేమీ లేదనుకుంటూ, మళ్ళా యిప్పట్లో రాగలమా అనుకుని, యిల్లు పిల్లెత్తుక పోతుందా అని నవ్వుకుంటూ, గుండు కొట్టించుకున్న తలలకు నల్లని గుడ్డన్నా చుట్టుకోలేదు. అపచారంట.

మెల్లిగా ఒక్కో సువార్త తెలిసింది. కొట్టుమీద కూచుంటానని మాటిచ్చిన బంధువు మలేరియా వచ్చి కూచోలేక కొట్టుకు తాళం పెట్టి వెళ్ళిపోయాడుట, కొట్టుముందు చిమ్మి నీళ్ళు పోసి కడిగి ముగ్గెట్టాల్సిన అమ్మాయి నీరాడిందిట. దుమ్మూ ధూళీ పేరుకున్నది. చీమలు పుట్టలు పెట్టుకున్నాయి. ఇతర పురుగులు గుమిగూడి ఆడుతున్నాయి. మిడతలు, చిమ్మటలు, పగుళ్ళలో గడ్డీ పిచ్చి మొక్కలూ మొలిచాయి, షట్టర్సు మాసినై.

తాళం తీసి యింట్లోకి వెళ్తే గాలికి తలుపులు విడివడిన కిటికీల నుండి యిల్లంతా దుమ్ము రాలింది. పాత్ర సామాను పందిరి మంచం మీద దుమ్ము.

నీరసించక ఇల్లంతా యధాస్థితికి తెచ్చుకున్నారు కుటుంబ సభ్యులు ఓపిగ్గా. కొట్టు గూడా బాగుచేసుకుని వ్యాపారం సాగించారు.

కుర్రాడూ పనిమనిషీ వచ్చి రత్నంశెట్టికి దణ్ణంపెట్టి చెంప లేసుకుంటే శెట్టి తిరుపతి ప్రసాదం యిచ్చాడు. కిస్టమర్సు వచ్చి, క్షేమమడుగుతూ బెల్లం కావాలని డిమాండు చేశారు. అప్పుడుగాని తాను భద్రంచేసిన బెల్లపుదిమ్మ గుర్తురాలేదు శ్రేష్ఠికి. ఆపద్ధర్మంగా మరో కొట్టునించి తెప్పించి యిచ్చాడు, అదేం చిత్రమో ఆనాడంతా

బెల్లం డిమాండ్ చేసే ఖాతాదారులే యెక్కువ వచ్చారు. తక్కిన కిరాణా బేరం చేశారుగానీ బెల్లం మొదట పేర్కొన్నారు.

ఒక ఖాతాదారు రత్నంశెట్టి దగ్గర చనవున్నాయన, శెట్టి మాటి మాటికి పక్క కొట్లనుంచి బెల్లం తెప్పించి ఖాతాదారుల కందించటం గమనించాడు, హాస్యమాడాడు.

బెల్లం నిండుకుందాయేం శెట్టీ?

ఉంది వుంది, ఇంట్లో వుంది తెస్తా. ఇవాళేగా బేరం సాగుతున్నది? కొట్టు తీసిందివాళే అని నవ్వాడు శెట్టి.

చీమలారగించాయేమో, తిరుపతి వెళ్ళి ఆలస్యంగా వచ్చావు.

మరి అంత దూరం వెళ్ళింది పరుగెత్తుకురావటానికా? అన్నీ చూసి, స్వామి దర్శనం చేసుకుని, మొక్కు తీర్చుకుని అందరికీ కావాల్సినవి కొనుక్కుని మెల్లిగా బయలుదేరాము యింటికి.

రాగానే చూసుకోలేదూ, బెల్లమున్నా చోట చీమలు చేరును అని నవ్వాడు ఖాతాదారు.

భద్రం చేసే వెళ్ళాగా. చిత్తం శివుడి మీదా బుద్ధి చెప్పుల మీదా అన్నట్టు, బెల్లపుదిమ్మె తటచుకు లేదా? అపరాధం. చుట్టూ చీమల మందు చల్లి వెళ్ళాను అన్నాడు నిబ్బరంగా.

కండచీమల్ని మందేమీ చేయలేదు శెట్టీ. వాటికి మందో లెక్క. పీక్కు తినటం వచ్చు. తిరుపతి క్షవరంలాగా చీమల క్షవరం గూడా బాధే. రాగానే చూసుకోవాలి.

యేదండీ! యిల్లంతా శుభ్రంచేసి కొట్టుతీసి శుభ్రం చేసి ఆర్డర్లో పెట్టి కూచున్నాను. బోణీ జరిగింది, సంతోషించాను. మధ్యాహ్నమూ టైము లేదు మరి.

సర్లే నే పోతున్నాను. యెందుకైనా మంచిది. ఇంటికెళ్ళగానే బెల్లమేమైందీ చూడు. బెల్లం ధర పంచదార ధరకంటె పెరిగింది. కస్టమర్ వెళ్ళిపోయాడు.

అలాగే, అలాగే అని బేరం బాగా పొద్దుపోయేవరకు చేసుకున్నాడు శెట్టి.

కొట్టు మూసి యింటికి చేరగానే స్టోర్‌రూమ్‌లో కెళ్ళి లైటేసి బల్లవేసి యెక్కి, అటకమీద చూశాడు రత్నంశెట్టి. కళ్ళు పెద్దవై గుండాగినంత పనైంది. యేమీ వూహకందలేదు. పిరంత గూడా మిగల్చకుండా అంతా స్వాహా చేసినై చీమలు. బట్ట నపేసిన అప్పడంలాగా వున్నది. దిగివచ్చి కిటికీలోంచి చూస్తే, వీధిదీపం రో చీమలబారు కంటపడింది.

4

ఇంటినిండా చేరిన చీమల్ని చూశాడు బావ కూర్మావతారం, వంట యింట్లో, స్టోర్‌రూమ్‌లో, డైనింగ్ హాలులో, బెడ్‌రూమ్‌లో, డ్రాయింగ్ రూమ్‌లో, వరండాలో, యింటి ముందు ఫుట్ పాత్‌కి రెండు వైపులా వున్న గరుడ పచ్చలంటి లాన్స్‌మీదో, దొడ్లో చెట్ల కింద, అన్నిచోట్లా పుట్టలోంచి బైటికొచ్చిన బెల్లం వాసన పట్టిన చీమలున్నాయి.

షెడ్‌లో డ్రైవరూ, కారూ, క్లీనరూ, మెకానిక్, యిద్దరు ప్యూన్స్. సిగరెట్లు తగలేస్తూ, గొంతుకూర్చుని బాతాఖానీ వేసుకుని కంటబడ్డారు.

బోర్‌వెల్ వున్న వేపు వెళ్తే, మంచి నీళ్లకోసం బిందెలతో వచ్చిన స్త్రీ పురుషులు సిగ్బాపాటీ చేస్తూ కనిపించారు. గేటువేపు వెళ్లాడు కూర్మయ్య, యాయవార బ్రాహ్మడు సంచీతో, చేతిలో మెరిసే యెర్రని రాగిచెంబుతో యెదురైనాడు.

శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః, అమ్మా ఉపాదానం వేసి పంపండి. ఇవాళ దశమీ శుక్రవారం అంటూ తిథివార నక్షత్ర, రాహుకాలం, వర్జ్యం సూర్యాస్తమయకాలం చెప్తూ నిలబడ్డాడు.

ఈ బంగ్లాలో బెల్లం బాలా వున్నదా శాస్త్రిగారూ? అని వ్యంగ్యంగా అడిగాడు కూర్మయ్య.

మరే, తెలిసే అడుగుతున్నట్టున్నారు బాబూ! సరసులు మన్నించాలి, బెల్లం లేనిదే చీమలు చేరుతాయంటారా? అని చమత్కరించాడు ఉపాదానానకొచ్చిన బ్రాహ్మడు.

ప్రస్తుతం బెల్లం పవరేమిటి? అని కూర్మా మళ్లా ప్రశ్నించాడు.

హెచ్ ఆర్ డి అంటున్నాడు బ్రాహ్మడు.

వంటమనిషి కాబోలు, దోసిలి నిండా మంచి తెల్లని బియ్యం తెచ్చి రాగిచెంబులో పోసి, గిరుక్కున తిరిగి పరుగెత్తిందింట్లోకి.

బ్రాహ్మడు నిష్క్రమించాడు.

కూర్మయ్య షెడ్‌వేపు నడిచాడు. క్లీనరెదురై దణ్ణం పెట్టాడు.

ఆయుష్మాన్ భవ! అని చేయెత్తి దీవించాడు కూర్మయ్య. ఈ చీమలన్నీ ఆత్మీయులే అని భావగర్భితంగా నవ్వాడు కూర్మయ్య.

క్లీనరూ నవ్వాడు.

కాదు బాబూ! అనేక పస్లుండి తీయని వాసనచే ఆకర్షించబడి వస్తాయి, అప్పు కావాలి, బాబు యివ్వకపోయినా యిప్పించగలరనీ వస్తారు అని నవ్వాడు.

నవ్వెందుకూ?

యియ్యగల యిప్పించగల అయ్యలకే గాని మీస మన్యల కేలా! రొయ్యకు లేదా బారెడు అన్నారు గదండీ, అది గుర్తొచ్చి నవ్వాను, బాబు మీసం చాలా అందంగా వుంటుంది, దాన్ని చూడటానికే వస్తారు.

ఇంతమందికీ యిస్తున్నాడూ బాబు? కాంట్రాక్టు పద్ధతిమీద, నెలకిరవేల జీతంమీద వెళ్లి గల్ఫ్‌లో దోచుకొచ్చినదంతా షేర్ల లోనూ, బాం్కలోనూ అనేక బాండ్ల రూపంలోనూ దాస్తే, దివాలా స్కామ్, కుంభకోణం, ఫోర్జరీ మొదలైనవి జరిగి తీయని బెల్లాన్ని చీమలు స్వాహా చేసినాయని అన్నాడే బాబు. మళ్లా చిప్ప చేతి కొచ్చిందన్నారే లోకులు.

అదంతా నిజమే బాబూ! కాని బాబు అలాటివాటికి డీలాపడే రకం గాదు, మీకు తెలియదేమో, మాదిట్ట, ఆపదలందు ధైర్య మన్నాడు కవి, మా గొప్ప కవి, చూసే అని వుండాలి, ఒక్క యాడాదిలో ధైర్యం కూడగట్టి, మంచి జాబ్ తెచ్చుకుని, ప్రమోషన్ ఇంక్రిమెంటు గూడా కొట్టారు బాబు, నాకు తెలుసు బాబుని అంటి పెట్టుకునే వున్నా మొదటినించీ కనుసన్నలలో మెలగుతా, తలలో నాల్కలాగా వుంటా నాకూ జాబ్ యిచ్చారుగా అలా అంటూ మీసం మీదికి చేయి పోనిచ్చాడు క్లీనర్.

యేమి చదివావూ? చాలా తెలుసె.

మెట్రిక్కు కడుతూవుంటా బాబూ! అని నవ్వాడు.

చిన్న పిల్లలకీ, వృద్ధులకీ గూడా అప్పు కావాలీ?

ఆశ్చర్యం అభినయించాడు కూర్మయ్య.

క్లీనర్ విరగబడి నవ్వాడు. బలే హ్యూమరుంది సార్ మీకు. రోగాలు, నొప్పులు నయం చేయించాలి మర్యాదలు చెల్లించాలి, వుద్యోగా లిప్పిస్తారు గదండీ బాబు, సెలెక్టు చేస్తారు గదండీ, రెండు చేతులా సంపాయిస్తున్నారని ప్రతీతి.

యెంత సంపాయించినా, యెంత చెట్టు కంత గాలి అని సమయానికి చేతిలో పైసా వుండదొక్కప్పుడు.

అదీ నిజమే బాబూ. నాకు కనుసన్న చేయాలేగాని చేయగానే నా వంక చూడగానే మునిసామి నడిగి తెచ్చి బాబు చేతిలో పోస్తా.

పని జరిగిపోతుంది. తరవాత తీరిగ్గా తీరుస్తారు బాబు. మాట నిలకడే బాబు ఆస్తి.

అందించకపోతేనో! అని చిత్రంగా నవ్వాడు కూర్మయ్య.

యెంత త్వరగా పని కానిచ్చి పంపేస్తే అంత మంచిది లేకపోతే యిక్కడే వుండి, బెల్లం పీక్కు తింటూ చీమలు హాస్య మాడుతూ వెళ్లవని - బాబు హాస్యమాడుతారు. బాబు లైఫ్‌ని స్పోర్టివ్‌గా తీసుకుంటారు. అందుకే ఆరోగ్యంగా వుండి నెగ్గు కొస్తున్నారు బాబు!

యెలా వాసన బడతాయి చీమలూ. బాబు చాలా దూరాన వున్నాడే. అంత దూరాన్నించే వాసన బట్టగలవూ? ఆ వుద్యోగమూ, ఆయన మంచితనమూ అలా తీయని వాసనలు విడుస్తాయి. దాంతో చీమల బారు, దోవలో తారసిల్లిన చీమలక్కూడా అక్కడ బెల్లపు దిమ్మ పెద్దదున్నది తిందాం రండి అని వాటిని గూడా వెంటబెట్టుకొస్తాయి సార్. అదే చీమల గొప్ప. చీమలు శ్రమజీవులు అని నవ్వుతూ వెళ్లిపోయాడు క్లీనర్.

[] [] []